క్లుప్తంగా

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు సన్మానం



ప్రీతంను సన్మానిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను ఎస్సీ డిపార్టుమెంట్ టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ దండోరా నర్సింహ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేవిధంగా కృషి చేస్తున్నార న్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు బంగారిగాళ్ల శ్రీనివాస్, వెంకటేష్, బంగారిగాళ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

జిరాక్స్ సెంటర్లకు నోటీసులు



నోటీసు అందజేస్తున్న పోలీస్

మునిపల్లి(అందోల్): పదో తరగతి పరీక్షల సందర్భంగా సెంటర్ల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని బుదేరా ఎస్‌ఐ సురేష్ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని బుదేరా, కంకోల్, మునిపల్లి, పెద్దచల్మెడ పరీక్షాకేంద్రాల్లో జిరాక్స్ సెంటర్లను కొనసాగించవద్దని నిర్వాహకులకు ఆదివారం నోటీసులు అందజేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దమ్మతల్లికి పూజలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని రేజింతల్ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మల్లమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, నాయకులు లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీహరి, సత్యనారాయణ, రాజు, చోటు, పండరి, వీరయ్య, శ్రావణి, పావణి తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మల్లేపల్లి లక్ష్మమ్మ–శంకర్‌రెడ్డిల జ్ఞాపకార్థం తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కిష్టోపర్, కుమార్‌గౌడ్, కౌన్సిలర్ లచ్చిరాంనాయక్, మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, వడ్డే నర్సింహులు పాల్గొన్నారు.

బోరుమోటారు ఏర్పాటు



బోరుమోటారు వద్ద ఆలయ నిర్వాహకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని జ్యోతిర్లింగ దేవాలయ నిర్మాణంలో భాగంగా జిన్నారం గ్రామానికి చెందిన వ్యాపారి రాజేందర్ బోరుమోటారు ఏర్పాటు చేయించేందుకు ముందుకు వచ్చాడు. ఈ సందర్భంగా దాత రాజేందర్‌కు ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కారు చోరీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు చోరీకి గురైన ఘటన రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో నివాసం ఉండే చిగురు శ్రీను పట్టణంలోని రాయసముద్రం చెరువులో రెండున్నరేళ్లు చేపల కాంట్రాక్టు తీసుకున్నాడు. రాత్రి సమయంలో చెరువులోని చేపలను ఎవరైన దొంగలిస్తారేమో అన్న అనుమానంతో ఆదివారం తెల్లవారుజామున తన కారులో రాయసముద్రం చెరువు కట్టపైకి వెళ్లి కారును ఆన్‌లో ఉంచి చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న క్రమంలో గమనించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి చిగురు శ్రీను కారుతో ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



ఝరాసంగం: తడిసిన ధనియా పంట కుప్పలను సరిచేస్తున్న రైతు



ఝరాసంగం: కృష్ణాపూర్ శివారులో విరిగిపడిన విద్యుత్ స్తంభం



ఝరాసంగం: ఈదురు గాలులకు నేలకొరిగిన జొన్న పంట

- నేలకొరిగిన పంటలు
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- ఆందోళనలో రైతులు, ప్రజలు

ఝరాసంగం(జహీరాబాద్): రెండు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. శని, ఆదివారాల్లో ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో బలమైన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి వివిధ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కోత కోసిన శనగ పంటతో పాటు ధనియ పంట కుప్పలు తడిసి ముద్దయ్యాయి. పలుచోట్ల జొన్న పంటలు నేలకొరిగాయి. ఆయా ప్రాంతాల్లో మామిడి పిందెలు రాలిపోయాయి. బలమైన గాలులకు వృక్షాలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో పలు గ్రామాలు అంధకారంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం ఉదయం విద్యుత్ స్తంభాలతో పాటు తెగిపడిన విద్యుత్ తీగలను అధికారులు సరి చేశారు. సాయంత్రం కురిసిన వర్షానికి సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కంగ్టి మండలంలో...

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని తడ్కల్, ముర్కుంజాల్, దామర్‌గిద్దా, జమ్గి, ఘన్‌పూర్, చాప్టా, బాన్సువాడ, గాంధీనగర్, రాసోల్ తదితర గ్రామాల్లో అకాల వర్షం కురిసింది. బాన్సువాడ గ్రామంలో ఎకరాల కొద్ది జొన్న పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులు వెంటనే స్పందించి పంట నష్టం వివరాలు నమోదు చేసుకొని ఆర్థికంగా సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

న్యాల్‌కల్ మండలంలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో శనగ, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల చెట్లు విరిగి నేలకొరిగాయి. అల్లాదుర్గం–మెటల్‌కుంట రోడ్డుపై ముంగి గ్రామ శివారులో చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, కంకోల్, బుదేరా, మునిపల్లి తదితర గ్రామాల్లో అకాల వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈదురు గాలులతో వర్షం..

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌తో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అకాల వర్షం కారణంగా మామిడి కాత, పూతకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

నేలరాలిన మామిడికాయలు

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో మామిడికాయలు నేలరాలాయి. భారీ వర్షం కారణంగా సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



ఝరాసంగం: వంగిపోయిన విద్యుత్ స్తంభం



న్యాల్‌కల్‌లో గాలివానకు కూలిన టెంట్లు



మునిపల్లి: కంకోల్ గ్రామంలో కురుస్తున్న వర్షం

అండగా నిలిచే పార్టీకే మా మద్దతు



మాట్లాడుతున్న సుదర్శన్

హెచ్‌ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్

పటాన్‌చెరు: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కార్మిక రంగానికి అండగా నిలిచే పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హెచ్‌ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్‌లో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈఎస్‌ఐ సంస్థలో కార్మికుల కష్టార్జితంతో పోగు చేసుకున్న రూ.2000 కోట్ల ఫిక్స్ డిపాజిట్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మిక రంగం ఉనికికి ప్రశ్నార్థకంగా మారిన నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే ప్రతి కార్మికుడికి రూ.10,000 వేల పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ నర్సయ్య, జనరల్ సెక్రటరీ రెబ్బ రామారావు, కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, కోశాధికారి భాగ్యవతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ జాతర



అమ్మవారి సన్నిధిలో కాటా సుధా, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కిష్టాయిపల్లి గ్రామంలో ఆదివారం గాలి పోచమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ ప్రకాశ్‌చారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వాజిద్ అలీ

పటాన్‌చెరు టౌన్: భూసమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వాజిద్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రామిక భవన్‌లో సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజిద్ అలీ మాట్లాడుతూ..పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల, రామచంద్రాపురం మండలాల్లో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో భూ సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. దీంతో వెంటనే స్పందించి భూసమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, అర్జున్, రామచంద్రమూర్తి, విశాల్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

జిన్నారం(పటాన్‌చెరు): ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో గుమ్మడిదల తహశీల్దార్ గంగాభవాని ఆదేశాల మేరకు ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఫ్లెక్సీలను తొలగించారు. అదేవిధంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగారు. గోడల మీద ఉన్న రాతలను తుడ్చివేయించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునా ప్రతిఒక్కరూ అధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

మునిపల్లి(అందోల్): మండలంలోని మునిపల్లి మోడల్ స్కూల్, బుదేరా, పెద్దచల్మెడ, కంకోల్ పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు ఆదివారం పరిశీలించారు. నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల్లో 144 సెక్షన్ అమలులో ఉండగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం..

కంగ్టి(నారాయణఖేడ్): పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈఓ శంకర్ తెలిపారు. సోమవారం ప్రారంభం కానున్న పరీక్షలకు మండలంలోని తడ్కల్, కంగ్టిలోని ఐదు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కంగ్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ కంగ్టి పరీక్షా కేంద్రంలో 216 మంది, జీజేసీ కేంద్రంలో 116 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..

రాయికోడ్(అందోల్): పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 396 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అందుకోసం రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు.

బీజేపీకి బుద్ధి చెబుదాం



మాట్లాడుతున్న జలాలుద్దీన్

నారాయణఖేడ్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్ పిలుపునిచ్చారు. ఖేడ్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్యతరగతి, దళితులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. నల్లధనం వెలికితీస్తానని చెప్పిన ప్రధానమంత్రి మోదీ నేడు బడాబాబులకు అండగా నిలిచారని ఎద్దేవా చేశారు. ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి యువతను మోసం చేశారని విమర్శించారు. రైతులకు వ్యతిరేకంగా చట్టాలను అమలు చేసి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థికి తమ పార్టీ తరఫున మద్దతు ఇచ్చి గెలిపిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆనంద్, నాయకులు చిరంజీవి, అజర్, మైబు, అశోక్, ఇసాక్, ప్రేమ్, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన తిరుమల్ రెడ్డి(41) ప్లంబర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇస్నాపూర్ నుంచి పోచారానికి బైక్‌పై వస్తుండగా, అదే సమయంలో ఎదురుగా బాచుపల్లి నుంచి ఇస్నాపూర్ వైపు బైక్ పై వస్తున్న తిరుమల్ రెడ్డి ఇతడి బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ తిరుమల్ రెడ్డిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య రాధిక ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా మలుపులు

కానరాని సూచిక బోర్డులు

- రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

గ్రామీణ రహదారులపై ప్రమాదకరంగా ఉన్న మలుపులతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అసలే గుంతలు ఏర్పడి పాడైన రోడ్లతో అవస్థలు పడుతున్న వాహనదారులకు మూలమలుపులు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. మలుపుల వద్ద కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. అదేవిధంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

– కంది(సంగారెడ్డి)

మండల పరిధిలోని మక్త అల్లూర్, కాశీపూర్, కలివేముల, చెర్లగూడెం, తోపుగొండ, చిద్రుప్ప, బ్యాతోల్, ఎర్దనూర్ గ్రామాలకు వెళ్లే దారుల్లో పలుచోట్ల ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. చేర్యాల నుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంద్రకరణ్ వెళ్లే రోడ్డులో 13 చోట్ల మలుపులు ఉన్నాయి. ఈ రహదారిపై వెళ్లే వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్తున్న పరిస్థితి నెలకొంది.

గుంతలమయంగా రోడ్లు

మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా ఉండటంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని, అంతేకాకుండా వాహనాలు దెబ్బతింటున్నాయని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను తొలగించి మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చెర్లగూడం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. బెంగుళూరు బైపాస్ రోడ్డుతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా మారాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– మహమ్మద్ ఆర్మాన్ అలీ, వాహనదారుడు

ప్రతిపాదనలు పంపించాం

ఆయా ప్రాంతాల్లో ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. పలుచోట్ల గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం. రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగిస్తాం. పై సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– రవీందర్, డీఈ

ఉత్తమ ఫలితాలను సాధించాలి

జిన్నారం(పటాన్‌చెరు): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హాల్‌టికెట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయాలని సూచించారు.

పెట్టుబడులకు ముందుకు రావాలి

జహీరాబాద్: భవిష్యత్తు ఉన్న చోట పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని వల్లూరి ఓక్స్ అధినేత గిరీష్ అన్నారు. మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో డీటీసీపీ అనుమతులతో కూడిన ప్రాజెక్టును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడుల కోసం జహీరాబాద్ ప్రాంతం ఎంతో అనుకూలంగా ఉందన్నారు. ఈ ప్రాంతానికి జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్)తో పాటు పలు పరిశ్రమలు రావడమే ఇందుకు కారణమన్నారు. అనువుగాలేని చోట పెట్టుబడులు పెట్టినా ఉపయోగం ఉండదన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.